


## ఇద్దాపురపు జగన్నాథరావు

చీకటి పడుతూంటే బయలుదేరాడు శంకరం.

లోపల మాట్లాడుతూ, అరగంట నించి సెలవు తీసుకుంటూన్న వసుంధర కోసం నాలుగో సారి కేకవేశాడు. ఈసారి చిరాకుతోపాటు అతని గొంతుకలో కోపం కూడా ప్రస్ఫుటమయింది.

"వస్తున్నా ..."

అతను పక్కన నిలబడ్డ మూర్తితో, "ఆడవాళ్లిలాగే ... మాట్లాడ్డంలో అబలలు కాదు. కాలాన్ని చంపడంలోనూ కాదు" అని హాస్య రహితంగా అని, కారులో వీల్ ముందు కూర్చుని గట్టిగా తలుపు వేశాడు.

వసుంధర పరుగులో వచ్చింది. అటు వెళ్లి తలుపు తీసుకుని కూర్చుంటూ, "వర్షం ఉందంటే ఆలస్యం చేశాను" అంది, మరెవ్వరికీ వినపడకుండా.

అందరికీ వినిపించేలా, "అంత చదివివా, ఈ పాతకాలపు నమ్మకాలు పోలేదు నీకు!" అని చిరాగ్గా అని, "వెడతాను మూర్తీ!" అన్నాడు అదే గొంతుకతో, శంకరం.

"నాకేం బాగులేదు నువ్విలా వెళ్లడం. ఆ దారి అంత మంచిది కాదు. రాత్రిళ్లు మరీని" అన్నాడు మూర్తి.

శంకరం ఇంజను స్టార్టు చేసి, ఆ రొదని మింగే కంఠంతో, "అలాటి భయాలు లేవులే!" అన్నాడు.

మూర్తి భార్య కిటికీమీద చేయి వేసి, "ఈ రాత్రి ఇక్కడ ఉండి చీకటి తోనే వెళ్లకూడదా? మీరు ఇల్లు చేరేదాకా ఆందోళనగానే ఉంటుంది" అంగి.


చేతకానట్టు నవ్వి, "ఏం? ఇంకా మీ కబుర్లు ముగియలేదా?" అన్నాడు శంకరం.

"అది కాదు... రాత్రి సమయం... వసుంధర—" అని ఆమె ఆగిపోయింది.


"ఆడపిల్ల!" అని ఆ మాట పూర్తి చేసి, మరోమారు నవ్విన శబ్దం చేసి, "నే నుండగా భయం లేదు లెండి వసుంధరకి. ఏభై మైళ్లు ... ఎంతసేపని! ఆలస్యం అవుతోంది. వస్తాము!" అని కారుని గేరులో పెట్టి అతను సాగిపోయాడు.

రెండు మైళ్లు వెళ్లాక గాని శంకరం మాట్లాడలేదు. అప్పటికి చీకటి పడింది. లైట్లు వేసి, వసుంధరవేపు ఒకసారి చూసి, మళ్లీ రోడ్డుమీదికి దృష్టి నిలిపి, "ఏమిటి అంత ఆలోచిస్తున్నావు?" అన్నాడు అతను.

"ఏమీ లేదు" అంది వసుంధర.



**ఒకరి మంచిని, గొప్పతనాన్ని గుర్తించడానికి సంస్కారం కావాలి. భార్య ఎంత చదువుకున్నా భర్త అధికారపు అహం స్త్రీ ఔన్నత్యాన్ని గుర్తించనివ్వదు. వీరి సంస్కారం, ఆత్మ స్థైర్యం పరీక్షకు నిలబడినప్పుడు?**



"మీ స్నేహితురాల్ని వదిలి రావడం కష్టమైందా? బాధగా ఉందా?" వెక్కిరింపుగా అడిగాడు శంకరం.

"ఎనిమిదేళ్లు కలిసి చదువుకున్నాం మేము..."

"నువ్వు ఎమ్. ఎ. లో చేరేదాకా."

"అవును."

"ఆమె ఎందుకు చేరలేదు?"

"పెళ్లి మూలాన."

"అంటే?"

"మామూలు కథే! వాళ్ల వాళ్లు తొందరపడి పెళ్లి చేశారు."

"బుద్ధిమంతులు!"

అటునించి వస్తున్న లారీకి బాగా చోటిచ్చి, ఆ ధూళి దాటేదాకా నెమ్మదిగా వెళ్లి, మళ్లీ ఆక్సిలరేట్ చేసి, ఆమె మౌనాన్ని అప్పుడే గమనించినట్టు, "అయినా, ఎందుకంత పెద్ద చదువుల్లో ఆడవాళ్లు! అంతా పెళ్లికోసమే కదా!" అన్నాడు శంకరం.

వసుంధర ఏమీ జవాబివ్వలేదు.

"నీలో ఒక గొప్పతనం ఉంది."

ఆమె రోడ్డు మీద నుంచి కళ్లు తిప్పలేదు.

"అదేమిటో చెప్పనా?"

"మీ ఇష్టం" అంది వసుంధర.

సంతృప్తిగా నవ్వి, "అది మరో మంచి గుణం నీలో ... చెప్పేదేమీ లేనప్పుడు, ఓడిపోయినప్పుడు మాట్లాడవు!"

ఆమె నిశ్శబ్దంగా కూర్చుంది.

"ఈ సంవత్సరంలోనూ అదే గమనించాను — మన పెళ్లి అయి సంవత్సరం అయిపోయింది! అరే, సరీగా క్రిందటి ఆదివారం! నువ్వు జ్ఞాపకం చెయ్యనే లేదు!" అన్నాడు శంకరం.

"నాకూ జ్ఞాపకం లేదు" అంది వసుంధర.

"పోనీలే..."

మరో పది మైళ్లు ఇద్దరూ మాట్లాడలేదు. హెడ్ లైట్ల కాంతిలో రోడ్డు పక్కన రెండు వేపులా పెరిగిన చెట్లు విచిత్రమైన రూపాలలో ప్రత్యక్షం అవుతున్నాయి. ఎక్కడా మరో మనిషి కనపడ్డం లేదు.

"భయంగా ఉందా?" అన్నాడు శంకరం.

"దేనికి?"

"ఇలాగ — ఈ రోడ్డు మీద, చీకట్లో వెళ్లడానికి..."

"లేదు."

"వాళ్లు చాలా భయపెట్టేరుగా?"

"అంటునాను."

"వర్షంలో బయలుదేరేంగా?"

"అంటునాను."

"ఏం?"

"మీరున్నారుగా!"

"గుడ్! బుద్ధిమంతురాలివి. చదువుకున్నా సరే!"

వసుంధర ఒకసారి అతని వేపు చూసి, కళ్లు రోడ్డుమీదికి మళ్లించింది. తన డిగ్రీమీద అతని నిరసన దైనందిన విషయం అయినా, ఎప్పటికప్పుడు ఆమెకి అతని నిరసన గాయంమీద దెబ్బలాగ తగులుతూనే ఉంటుంది. ఆ బాధ దాచుకోవడం నేర్చుకుంది వసుంధర. ముఖంలో ఏ కొంచెమైనా తన బాధ కనిపిస్తే అతని ఎత్తిపొడుపులకి అంతం ఉండదని తెలుసు. కోటని ముట్టడి చేస్తూన్న సైన్యానికి ఏ కొంచెం దారి దొరికినా వాళ్లు ఆగనట్టు అతను సాగిపోతాడు.

పెళ్లయిన కొత్తలో అత నిలాగే ఏదో అంటే, "మన ప్రధాన మంత్రిని చూడండి! చాలా మంది మగవాళ్లని హడల గొట్టింది!" అని ఆమె జవాబిచ్చింది. అప్పటికింకా ఆమెకి అనేక విధాల జ్ఞానం రాలేదు.

వికటంగా నవ్వి, "నువ్వూ అంతటి దానివన్న మాట!" అని వెక్కిరించాడు శంకరం. ఆ తరవాత ఏమాత్రం సందర్భం వచ్చినా, రాకపోయినా—"వసుంధరకి ప్రధాన మంత్రి కావాలని ఉంది. ఆ కోరిక ఎలాగ తీర్చేది?" అనేవాడు. చివరికి ఒకనాడు జగన్మోహన్ — ఆయనకి చాలా స్నేహితుడు — తలవాచే చీవాటు పెట్టి, అప్పటికీ నమ్మకం కుదరక, అందరిలో నవ్వుల పాలు చేస్తానని భయపెట్టాక అతను ఆ విషయం మళ్లీ ఎత్తడం మానేశాడు. ఆ సాయంత్రం అదేమీ తనకి తెలియనట్టు తాను నటించడం — అబ్బ! ఎంత కష్టం అయిందని!

"సగం దూరం వచ్చాం" అన్నాడు శంకరం.

"అహా!" అంది వసుంధర.

"ఓ పాట పాడు" అన్నాడు అతను.

"నాకు పాడడం రాదు" అంది ఆమె.

"పూర్వం పాట వస్తేగాని పిల్లకి పెళ్లి అయేది కాదు!"

ఆమె ఏమీ అనలేదు.

"లలితకళలన్నీమరుగుపడిపోయాయి!"

ఆమెకి దాహంగా ఉంది.

గొంతుక సవరించుకొంది.

"భయంగా ఉందా?"

"లేదు."

హఠాత్తుగా శంకరం కారు ఆపాడు. రోడ్డుమీద బండి ఒకటి అడ్డంగా నిలబడి ఉంది. రోడ్డుకి రెండు వైపులా కాలవ లున్నాయి.

కిటికీలోనించి మెడ బయటికి పెట్టి, "ఎవ రా బండి? పక్కకి తియ్యి!" అన్నాడు శంకరం.

బండిలో ఎవరూ లేరు. ఎద్దులు కాడికింద లేవు.

"విచిత్రంగా ఉందే!" అని శంకరం క్రిందికి దిగబోయి, మళ్లీ కూర్చొని, "ఏదో మిస్చీఫ్‌లా ఉందే!" అన్నాడు.

వసుంధర మాట్లాడలేదు.

"నీకేం భయం లేదు" అన్నాడు శంకరం. చుట్టూ చూస్తూ అతను వీల్ చాలా గట్టిగా పట్టుకున్నాడు. గొంతుకమాత్రం బలంగా లేదు.

అతను హార్న్ మోగించాడు.

ఆ శబ్దం ఆ నిశ్శబ్దంలో ప్రతిధ్వనించింది.

అతను మళ్లీ చుట్టూ చూశాడు. ఇంతలో వచ్చారు ఇద్దరు — ఒకడటునించీ, ఒకడిటునించీ.

"ఎవరు మీరు?" అన్నాడు శంకరం. అతనికి దాహంగా ఉన్నట్టుంది.

"కనపడ్డం లేదా? మనుషులం!" అన్నాడు ఒకడు, కారు తలుపు మీద చెయ్యి వేసి. వసుంధర పక్కనించి వీడూ అటు వెళ్లి, "ఇంజనాపే, బాబూ! ఎందుకని — పెట్రోలు దండగ?" అన్నాడు.

"ఏమిటి మీ ఉద్దేశం?" అన్నాడు శంకరం వాళ్లవేపు చూడకుండా.

"ఏముందీ? ఎలాగా మీ బండి ముందుకీ వెనక్కీ వెళ్లదు కనక, ఇంజనాపుచేసే మన్నాను."

"ఆ బండి ... ఆ బండి — పక్కకి తీసేయ్!" అన్నాడు శంకరం. దాహం ఎక్కువౌతూన్నట్టు ఉంది అతని గొంతుక.

అవతలి వాడు నవ్వి, "దిగి నువ్వే తీసేయ్!" అన్నాడు.

"ఎవరయ్యా మీరు? నువ్వంటే నువ్వని —"

"మరి నువ్వంటే తమరని మాట్లాడాలా?"

దీనికి సరి అయిన సమాధానం అతనికి దొరికినట్టు లేదు. ఇంజను కట్టేస్తూ, "ఇన్సొలెంట్ రాస్కెల్స్!" అని గొణుక్కున్నాడు.


"ఆమాత్రం ఇంగిలీషు నాకూ వచ్చునయ్యోయ్! మాటలు కొంచెం జాగ్రత్తగా రానీ!" అన్నాడు రెండో వాడు.

ఇద్దరూ పాతికేళ్ల లోపు వాళ్లే. గెడ్డాలు పెరిగి ఉండీ, తలలు చింపిరిగా ఉండీ నీరసంగా కనిపిస్తున్నారు. ఒకడు పంట్లాం మీద బుష్ షర్టు వేసుకున్నాడు. రెండోవాడు లుంగీ మీద లాల్చీ వేశాడు. ఇద్దరి బట్టలూ మాసి ఉన్నాయి.

"ఏం కావాలి మీకు?" అన్నాడు శంకరం. అతని గొంతుకలో తొట్రుపాటు స్పష్టంగా వినిపించింది వసుంధరకి.

వాళ్లిద్దరూ నవ్వారు.

"మాక్కాదయ్యా, కావలసింది. నీకూ! ఇంటి కెళ్లాలని ఉందా?" అన్నాడు రెండోవాడు.



శంకరం మాట్లాడలేదు.

అతనే మళ్లీ, "వెళ్లాలని లేదా?" అన్నాడు వెక్కిరింపుగా.

"ఉంది."

"అందుకా బండి అడ్డం..."

"అవును."

"తీస్తే ఏమిస్తావు?"

కొంచెం ఆలోచించి, "ఒక రూపాయి ఇస్తాను" అన్నాడు శంకరం.

మళ్లీ ఆ ఇద్దరూ నవ్వారు.

"శిబిచక్రవర్తి లాటి వాడు!" అన్నాడొకడు.

"బలిచక్రవర్తిరా!" అని రెండో వాడు.

"హాస్యానికేం గానీ, సరిగా చెప్పు..." అన్నాడు మొదటివాడు.

"దిగి రావయ్యా! అంత దర్జాగా కూర్చుంటే ఒక రూపాయి వరకే వెడుతుంది ఆలోచన మరి. ఈ చల్లగాలి పీల్చేవంటే ..."

రెండో వాడు కదలకుండా కూర్చున్న శంకరాన్ని జబ్బ పట్టుకుని కిందికి లాగాడు. శంకరం తొడుక్కున్న టెరిలిన్ బుష్ షర్టు ఆ లాగడంలో చిరిగింది. అతను కారు ముందు, దీపాల కాంతిలో నిలబడ్డాడు. అతని వణుకు వసుంధరకి స్పష్టంగా కనిపించింది.

"తియ్! ఏమాత్రం ఉంది?" అన్నాడు ఒకటో వాడు.

శంకరం జేబులో ఉన్న అయిదు రూపాయలూ తీశాడు.

విరగబడి నవ్వారు ఇద్దరూ.

"గడియారం, కారు, పెన్ను — ఇన్నీ ఉండి, అయిదా! ఛస్! అబద్ధాలు — తప్పుకాదూ? తియ్— ఎక్కడ ఉందో!"

"ఇంక లేదు."

ఒకడు రోడ్డు మీద ఉమ్మి, "పర్స్ తియ్యి" అన్నాడు శంకరానికి దగ్గరగా వస్తూ.

"పర్స్ లేదు..."

అతని డబ్బు ఆమె బాగ్‌లో ఉంది— అది అతని అలవాటు.

ఒకడు గబగబా అతని ఒళ్లంతా తడిమి చూసి, "నిజమేరా! డబ్బున్న వాళ్లని నమ్మకూడదు!" అన్నాడు.

రెండో వాడు నిమిషం తేరిపారచూసి, నాలు గడుగుల్లో వసుంధర పక్కన నిలబడ్డాడు.

వసుంధర బాగ్ తీసుకుని ఒక్కసారిగా కిందికి దిగింది. అక్కడ నిలబడ్డ వాడి వంక చూడకుండానే వెళ్లి శంకరం ముందు నిలబడింది.

"ఆ బండి తియ్యండి" అంది, అప్పటికి కలిసి నిలబడ్డ ఇద్దర్నీ చూస్తూ.

వాలు చూపులు

చిత్రం—రంగారావు (దేవరకొండ)



"ఆ గాజు లిలా ఇచ్చెయ్యమ్మా — బండి అలా తీసేస్తాం" అన్నాడు రెండో వాడు.

"గాజులు కావాలేం?" అంది కోపంగా వసుంధర.

"అవును" అన్నారు వాళ్లిద్దరూ, ఆమెకి రెండు వైపులా దగ్గరగా వస్తూ.

ఆమె కదల్లేదు. శంకరం ఆమెని కొంచెం వెనక్కి లాగబోయాడు. అతన్ని విదిలించుకుని ఆమె కదలకుండా నిలబడింది. పురుగుల్నిలాగ వాళ్లిద్దర్నీ చూస్తూ, రక్తారుణ నేత్రాలతో, "మీకు నిజంగానే కావాలి, గాజులు! పనీ, పాటూ చేతకాక, దొంగతనానికి దిగి, వచ్చి పోయే వాళ్లనీ, ఆడవాళ్లనీ బెదిరించే మగాళ్లు మరి! సిగ్గు లేకపోతే సరి!" అంది.

వాళ్లిద్దరూ తెల్లబోయి చూశారు.

"కదలరేం? సిగ్గుతోబాటు బుద్ధి కూడా నశించిందా? పోతుల్లాగ ఉన్నారు. ఆ బండి పక్కకి తియ్యండి" అంది.

"ఏమిటమ్మా నీ డాబు? భయ పడిపోతా మనుకున్నావా?" అన్నాడు మొదటి వాడు.

ఇంకా ప్రజ్వరిల్లిపోయింది వసుంధర.

"మీకు భయమా? ధైర్య వంతులు మీరు! అందులోనూ, ఒంటరిగా ఆడవాళ్లు దొరికితే మహావీరులు! సిగ్గులేని చవటలు! ఛీ ఛీ!" అంది. శంకరం వేడికి తట్టుకోలేనట్టు ఒక అడుగు వెనక్కి వేశాడు.

రెండో వాడు ఏదో నిశ్చయించినట్టు చెయ్యి ఎత్తాడు. వసుంధర బాగ్‌తో వాడి ముఖంమీద ఒక దెబ్బ కొట్టింది. కంటికి తగిలినట్టుంది. వాడు రెండు చేతుల్లోనూ ముఖం దాచుకున్నాడు.

మొదటి వాడు విభ్రాంతుడిలాగ తన స్నేహితుడివైపూ, ఆమె వైపూ చూస్తూ నిలబడిపోయాడు. తేరుకుని, ఆమెవైపు కోపంగా చూశాడు.

"ఆడదానివైపోయావు గాని ..."

వసుంధర మళ్లీ బాగ్ ఎత్తింది. వాడు అప్రయత్నంగా వెనక్కి అడుగు వేశాడు.

"ఆడదాన్నే — మీరేం పెద్ద మగాళ్లు? చేతనయితే ఎవడైనా రౌడీ ఉంటే వాడిమీద ప్రతాపం చూపెట్టండి. చచ్చు పెద్దమ్మల్లాగ, పనీ పాటూ దొరక్కా, చెయ్యకా, దొంగతనాలకి దిగి, పెద్ద మగాళ్లమని చెబుతారేం? పదండి, ఆ బండిని పక్కకి తొయ్యండి."

ఆ ఇద్దరూ నిమిషం నిలబడి, నెమ్మదిగా అడుగులు వేసి బండి దగ్గరికి వెళ్లారు.

"మీరూ వెళ్లండి."

ఆమె వెనక్కి తిరక్కపోయినా, శంకరానికి అర్థమైంది. త్వరగా అతను అప్పటిదాకా చేతిలోనే ఉండిపోయిన అయిదు రూపాయల నోటుని జేబులో పెట్టుకుంటూ వాళ్లిద్దరికీ బండిని పక్కకి తొయ్యడానికి సహాయం చేశాడు. రెండు నిమిషాల్లో రోడ్డు ఖాళీ అయింది.

అప్పటికి వసుంధర కారు స్టార్టు చేసి, అతనికోసం ఆపింది. అతను డ్రైవర్ సీటు వైపు వెళ్లి, ఆమె జరిగాక వీలు పట్టుకున్నాడు. కారు గేర్‌లో పెట్టబోతూంటే, "ఆ నోటు వాళ్లకివ్వండి" అంది.

వాళ్లిద్దరూ రోడ్డు వారన నిలబడ్డారు. అతను నోటు పట్టుకుని, "ఇదిగో!" అన్నాడు.

వాళ్లు రాలేదు.

"కిందని పడేయండి."

అతను పడేసి, కారుని పోనిచ్చాడు. మనిషి వణికిపోతున్నాడు. కారు సక్రమంగా పోవడం లేదు.

"కారాపి, మీ రిటు రండి ..."

అతను మాట్లాడకుండా కారు ఆపి, ఆమె దిగగానే అటు జరిగి కూర్చున్నాడు. ఆమెకి డ్రైవింగ్ వచ్చునని అతనికి అప్పటిదాకా తెలియదు.

బాగ్ వెనక సీటుమీద పడేసి వసుంధర మరో అరగంటలో ఇల్లు చేరింది. ఆ అరగంటలోనూ ఎవ్వరూ ఒక్క మాటా ఆడలేదు.

గరాజ్‌లో కారు పెట్టి బాగ్ తీసుకుని, వసుంధర లోపలికి వెళ్లి రెండు గ్లాసులు మంచినీళ్లు తాగింది.

ఆ తరవాత ఆమె కృశించిపోయినట్టు కుర్చీలో కూర్చుంది.

ఒక్కసారి ఏడుపూ, కన్నీళ్లూ వచ్చాయి. వసుంధర ఆపుకోలేకపోయింది.

శంకరం వచ్చి ఆమెని పొదివి పట్టుకుని, "పిచ్చిపిల్లా! ఎందుకా ఏడుపు?" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

"అదంతా మరిచిపో ... అంతగా భయపడడం ఎందుకు? అంతా అయిపోయిందిగా?" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. ఆమె దుఃఖం తగ్గనూ లేదు.

"నే నున్నానుగా! ... నీ మీద చెయ్యి వేస్తే వాళ్ల ప్రాణాలు నిలబడేవి కావు..."

వసుంధరకి ఏడుపు ఆగలేదు — నవ్వు రాక.

ఆమెకి దుఃఖమూ ఆగలేదు. దానికి కారణం జరిగిన ఉదంతం కాదు; జరగని ఎన్నో విషయాలు.

అందుకే శంకరం వసుంధరని చాలా సేపటిదాకా ధైర్యం చెప్పి ఓదార్చలేకపోయాడు. ★